క్లుప్తంగా

నేటి నుంచి భావనారుషి బ్రహ్మోత్సవాలు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసి యున్న భద్రావతి సమేత భావనారుషి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉడతా భాస్కర పార్వతీశ్వరరావు, జి.వెంకటసుబ్బారావులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, నగరోత్సవం, పొన్నమాను ఉత్సవం, కళ్యాణోత్సవం, రథోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

రేపు జిల్లాస్థాయి పొట్టేళ్ల పందేలు

బల్లికురవ: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పాత మల్లాయపాలెం అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ఆదివారం ఉదయం నుంచి జిల్లా స్థాయి పొట్టేళ్ల పందేలు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి బహుమతిగా రూ. 10 వేలు మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ, రెండో బహుమతి రూ. 5 వేలు సర్పంచ్ జూపల్లి రాఘవరావు, మూడో బహుమతి రూ. 3 వేలు వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి శంకర్, నాలుగో బహుమతి రూ. 2 వేలు జడ వెంకటకోటేశ్వర రావు, మఠ్రి సాంబశివరావు అందజేస్తున్నారని చెప్పారు. ఎర్ర ముత్తు, రంగులు వేసిన పొట్టేళ్లు పోటీల్లో పాల్గొనే అవకాశం లేదన్నారు.

ముగిసిన కుష్టు, ఫైలేరియా సర్వే

బల్లికురవ: ప్రభుత్వం కుష్టు, ఫైలేరియా రోగులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఇంటింటా సర్వే శుక్రవారం సాయంత్రంతో ముగిసినట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, రమీజ్ అహమ్మద్ రవితేజ ఒక ప్రకటనలో చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామాల వారీగా శరీరంపై మచ్చలు, కాళ్లపై బొబ్బలు ఉన్నవారిని గుర్తించినట్లు చెప్పారు. ఫైలేరియాకు రాత్రిళ్లు రక్త నమూనాను సేకరించినట్లు వైద్యాధికారి వివరించారు. సర్వేతో గ్రామాల వారీగా రోగులను గుర్తించి మందులతో అదుపులోకి తెస్తామని వైద్యాధికారులు తెలిపారు.

జూదం నిర్వహిస్తే చర్యలు

బల్లికురవ: సంక్రాంతి పండుగను బంధుమిత్రులతో గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై వి.వేమన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండగ సందర్భంగా కోడి పందేలు, పేకాట ఆడినా, చూసినా ప్రోత్సహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో తిరుగుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసీరామ్

వేటపాలెం: జాండ్రపేట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం చీరాల సిపాయిపేటలో గల లత హాస్పిటల్ వైద్యుడు జీ రాజ్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు బీ తులసీరామ్ 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి పరీక్షల నిమిత్తం వైద్యశాలలకు సిఫార్సు చేశారు.

మొలబంటికి అంబేడ్కర్ పురస్కారం



ఎం వెంకటేశ్వర్లు, ఎంఈఓ, కారంచేడు

కారంచేడు: కారంచేడు-2 ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన మొలబంటి వెంకటేశ్వర్లుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం లభించింది. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కే లక్ష్మణరావు తల్లిదండ్రుల పేరు మీద నెలకొల్పిన కేవీఆర్ అండ్ విజయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ తరుపున విద్యావ్యవస్థలో విశిష్ట ప్రతిభను కనపరచిన ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులకు పురస్కారాలు అందిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తి చేసుకొని 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టడంతో పాటు, విశిష్ట సేవలకు గుర్తుగా పురస్కారాలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 26వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శాసనమండలి చైర్మన్ కే మోషేన్‌రాజు చేతుల మీదుగా వెంకటేశ్వర్లుకు పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

నేటి నుంచి పర్చూరులో క్రికెట్ పోటీలు

పర్చూరు(చినగంజాం): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు పర్చూరులో దక్షిణ భారత స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తులసి శివనాగేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సౌజన్యంతో నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయన్నారు. మెదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి లక్ష రూ.1 లక్షలు నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

దేశానికి విలువైన సంపద వివేకానంద



అద్దంకి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు



అద్దంకి: వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రోటరీ సభ్యులు

- ఘనంగా యువజన దినోత్సవం
- యువతకు వివేకానంద స్ఫూర్తి

అద్దంకి: దేశానికి విలువైన సంపద స్వామి వివేకానంద అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం పలు మండలాల్లో నాయకులు, స్వచ్ఛంద సంస్థలు జాతీయ యువజన దినోత్సవంగా సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కట్టారామ కోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జంతు రాసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 'ప్రేరణ' పేరుతో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రేరణ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 500 మంది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో మొదటి రోజున మానవతా విలువలు, వాచక సామర్థ్యం పెంచుకోవడం కోసం ఉద్యోగ సాధనకై నైపుణ్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దాసు, డాక్టర్ పీవీ హెమలత, డాక్టర్ షేక్ మస్తాన్ వలి, వీబీవీ రామకృష్ణ, కార్యవర్గంగా వ్యవహరించి కార్యక్రమాన్ని నడిపించారు. న్యాయ నిర్ణేతలుగా ఎండీ నయీమ్, ఎస్ షర్మిల వ్యవహరించారు.

నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చిన్ని మురళీ కృష్ణ అన్నారు. రోటరీ కార్యాలయంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. రోటరీ అధ్యక్షుడు మాట్లాడుతూ వివేకానంద రామకృష్ణ పరమహంస శిష్యుడిగా మారి, సర్వమత సామరస్యం కోసం దేశ విదేశాల్లో పర్యటించి ప్రచారం చేసిన మహానుభావుడన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజెరర్ కొల్లా భువనేశ్వరి, షేక్ మహ్మద్ రఫీ, దేవపాలన, అన్నంనేని వెంకట్రావు, మలాది శ్రీనివాసరావు, గోనుగుంట సుబ్బారావు, చుండూరి మురళీ సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



కారంచేడులో పంచాయతీల అభివృద్ధిపై శిక్షణనిస్తున్న రమేష్‌బాబు

కారంచేడు: గ్రామాల్లోని పంచాయతీల అభివృద్ధికి సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు మండల పరిషత్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతి ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యదర్శులు, సిబ్బంది గ్రామాలకు వచ్చే ఆదాయం, ఖర్చులను జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. సాధారణ నిధులు, ప్రభుత్వం అందించే అభివృద్ధి నిధులు, పన్నుల ద్వార వచ్చే నిధులు, దాతల సహకారంతో వచ్చే నిధులు వంటి ప్రతి పద్దును జాగ్రత్తగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం ఆనిధుల వినియోగంపై ఒక ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో పలుగ్రామాల కార్యదర్శులకు వచ్చిన అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, 12 సచివాలయాల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



జీపీడీపీపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందిస్తున్న మాస్టర్ ట్రైనర్

చీరాల టౌన్: 2024-25 ఆర్థిక సంవత్సరాలకు గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మాస్టర్ ట్రైనర్, కార్యాలయం ఏవో శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీరాల మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు జీపీడీపీపై ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. సమావేశంలో సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



క్రీడాకారులతో అధికారులు



చీరాల: ఖోఖోలో పాయింట్ కోసం ప్రయత్నిస్తున్న క్రీడాకారుడు

చీరాల టౌన్: యువతీ, యువకులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటుగా మెరికల్లాంటి క్రీడాకారులను తయారుచేసి ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం రూపొందించిందని ఎంపీడీవో కె.నేతాజీ అన్నారు. శుక్రవారం చీరాల మండలంలోని దేవాంగపురి, ఈపురుపాలెం గ్రామాల్లో జరుగతున్న మండలస్థాయి పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. ఖోఖో, వాలీబాల్, క్రికెట్, రింగ్ ఆట, టెన్నీస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి పెరిగిన గిరాకీ

- బల్లికురవ, అద్దంకి మండలాల నుంచి పల్నాడు జిల్లాకు తరలింపు



వల్లాపల్లి నుంచి తరలిస్తున్న పశుగ్రాసం

బల్లికురవ: సాగర్ కాలువలకు ఈ ఏడాది నీటి విడుదల లేకపోవటం ఆయకట్టు పరిధిలో వరి సాగు చేపట్టనందున పశుగ్రాసానికి గిరాకీ పెరిగింది. బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, బల్లికురవ, కొమ్మినేనివారిపాలెం, అద్దంకి మండలంలోని ధర్మవరం, రెడ్డిపాలెం, కలవకూరు గ్రామాల్లో బోర్ల కింద ఆహార ధాన్యమైన వరి పంటను ఖరీఫ్‌లో చేపట్టారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తై నూర్పిడిలు జరుగుతుండటంతో రైతులు తమ అవసరానికి పోను మిగిలిన గడ్డిని విక్రయిస్తున్నారు. ఎకరా గడ్డి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. గతేడాది ఎకరా రూ. 6 వేలనుంచి 7 వేలవరకు పలికింది. ఏడాది వరిసాగు లేనందున మిచాంగ్ తుఫాన్‌కు పంటలు వరికోత యంత్రం ద్వారా నూర్పిడి చేయటం వల్ల గడ్డి వచ్చే పరిస్థితి లేదు. దీంతో గ్రాసానికి గిరాకీ పెరిగిందని రైతులు చెప్తున్నారు. పైగ్రామాల నుంచి వారం రోజులుగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట పరిసర గ్రామాలకు రైతులు తీసుకెళ్తున్నారు. ట్రాక్టర్‌కు ఎకరన్నర వరకు గడ్డిని వేసి బాడుగ ఖర్చులు కలుపుకుని రూ. 20 వేల వరకు దాటుతుందని రైతులు వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రావాలి



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ బలరాం, నాయకులు

పర్చూరు (చినగంజాం): ఈనెల 19వ తేదీన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా అందరూ విజయవాడ తరలిరావాలని మాజీ జెడ్పీటీసీ నూతలపాటి బలరాం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల భారీ విగ్రహన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఇంకొల్లు మండల పార్టీ కన్వీనర్ బండారు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కాకుటూరి బాబురావు, ఇంకొల్లు వైస్ ఎంపీపీ చలమయ్య, గోపతోటి బాబురావు, రత్నరాజు, జంగా అనీల్, కంచనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, ఇస్సాక్, అడపా సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అండగా కిసాన్ క్రెడిట్



సాగుబడిలో సూచనలు అందిస్తున్న మత్స్యశాఖ సహాయకుడు

చీరాల టౌన్: మత్స్యకారులను ఆదుకోవడంతో పాటు వేట సామగ్రిని కొనుగోలు చేసుకుని జీవనప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుతో రుణాలు అందిస్తుందని వాడరేవు మత్స్యసహాయకులు మరియదాసు తెలిపారు. శుక్రవారం మండలంలోని వాడరేవు గ్రామ సచివాలయంలో మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, రాయితీలను అందిస్తుందన్నారు. 75 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సీ సేఫ్టీ పరికరాలను కూడా అందిస్తుందన్నారు. లబ్ధిదారుడికి రూ.1 లక్ష వరకు కిసాన్ క్రెడిట్ రుణాలతో వేట పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు ఉన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం నుంచి 16వ తేదీ వరకు మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో 8వ జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళానికేతన్ కళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, సీహెచ్ సాయిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రదర్శించేందుకు 12 నాటికలను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ప్రతి నాటికకు రూ.20 వేలు పారితోషకంతో పాటు దర్శక నిర్మాతలకు చెరో రూ.1000 నగదు ఇస్తారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నాటికలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలుగా నగదు బహుమతి నిర్ణయించినట్లు వారు వివరించారు. ఇవికాక నటీనటులకు కూడా మరికొన్ని వ్యక్తిగత బహుమతులు కూడా అందజేస్తామని చెప్పారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయనం, పుష్యమాసం, ఉత్తరాషాఢ, విదియ తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తుల పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు హనిమిరెడ్డి రెండు గ్రామాల్లో పల్లెనిద్ర

బల్లికురవ: మండలంలోని వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో శనివారం సాయంత్రం పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన తెలిపింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగాంజనేయులు

వేటపాలెం: ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు రూపొందించాలని పీవీ మిజోరాం విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగం ప్రొఫెసర్ నాగాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎన్ఐఆర్ఎఫ్ ఫోకస్ రీసెర్చ్‌పై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ రీసెర్చ్ ఎక్సలెన్స్‌ను నడిపించడంలో దాని కీలక పాత్రపై వివరించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సిస్టమ్‌లోని చిక్కులను ప్రత్యేకంగా పరిశోధనా పారామితులపై దృష్టి సారించాలన్నారు. అత్యాధునిక పరిశోధన, ఇంధనంగా గ్రాంట్లు స్పాన్సర్‌షిప్‌ల ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాల్‌రావు, వివిధ విభాగాల పీహెచ్‌డీలు పాల్గొన్నారు.

ఉన్నతమైన తీర్పులు అందించాలి



లక్ష్మీ లావణ్య, సింధూరలను సత్కరిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: నూతన న్యాయమూర్తులు నిబద్ధతతో పనిచేసి కక్షిదారులకు ఉన్నతమైన తీర్పులు అందించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహనా అన్నారు. చీరాల కోర్టులో న్యాయవాదులుగా విధులు నిర్వర్తించి పాలకొల్లు, తిరువూరు పట్టణాలలో న్యాయమూర్తులుగా ఉద్యోగోన్నతి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల బార్ అసోసియేషన్ హాలులో న్యాయమూర్తులుగా ఎంపికైన వారిని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టులలో పని చేస్తున్న సిబ్బందిని, కక్షిదారులను, న్యాయవాదులను, పోలీసులను సమానంగా చూడాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబుతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. చీరాల కోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తూ న్యాయమూర్తులుగా పి. లక్ష్మీ లావణ్య పాలకొల్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎ. సింధూర తిరువూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియామకం కావడం చీరాల న్యాయవాదులకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఏపీపీ పద్మారెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఆర్. వెంకటేశ్వర రెడ్డి, న్యాయవాదులు ఎంవీ చలపతిరావు, టిజే. సాయిబాబు, ఆర్. రమేష్ కుమార్, ఎ. సత్యనారాయణ రెడ్డి, బీ హరికృష్ణ, ఎస్. రామకోటేశ్వర రావు, ఎస్‌కె. సిరాజ్, సీహెచ్ సురేష్, ఐ పవన్‌కుమార్, ఎం అశోక్ కుమార్, ఎం. తారక్, ఉదయభాస్కర్, సతీష్ రెడ్డి, మణి నాగశయన, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- నలుగురికి స్వల్పగాయాలు
- తప్పిన పెనుప్రమాదం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

మద్దిపాడు: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలైన ఘటన శుక్రవారం సాయంత్రం మండల కేంద్రం మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు ఒంగోలు నుంచి అద్దంకి వెళుతున్న డబుల్ స్టాప్ బస్ మద్దిపాడు సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి ఉండగా డ్రైవర్ పొరపాటున ఫ్లైఓవర్ పైకి వెళుతూ ఉండగా మద్దిపాడు స్టాప్‌కు సర్వీస్ రోడ్డులో వెళ్లాలని ప్రయాణికులు చెప్పారు. దీంతో డ్రైవర్ బస్సును రివర్స్ గేర్ వేసి వెనక్కు తీసుకువెళుతుండగా వెనుక నుంచి విజయవాడ వైపు వెళుతున్న బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును వెనుక భాగంలో ఢీకొంది. ఈక్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒంగోలుకు చెందిన శ్రీకాంత్ అనే యువకుడికి తలపై స్వల్పగాయాలు కాగా అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన శోభ అనే మహిళకు ముక్కు నుంచి రక్తం కారింది. సంతనూతలపాడు మండలం బండివారి పాలేనికి చెందిన రామేశ్వరరావు అనే వృద్ధునికి వెన్నెముక దగ్గర ఒత్తుకు పోవడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. బస్సు కండక్టర్ బల్లికురవ మండలం కొప్పెరపాడుకు చెందిన గౌతమి చేతి మణి కట్టు వద్ద ఎముక చిట్లినట్లు సమాచారం. క్షతగాత్రులను 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. పండగ సెలవులకు ఇళ్లకు వెళుతున్న విద్యార్థిలు చాలా మంది బస్సులో ఉన్నారు. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సును ఢీకొన్న లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మద్దిపాడు పోలీసులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్షతగాత్రులను పరామర్శించిన బాపట్ల ఎంపీ

మద్దిపాడు: లారీ, బస్సును మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వారిని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ శుక్రవారం పరామర్శించారు. ఒంగోలులో పార్టీ కార్యక్రమానికి వెళుతన్న క్రమంలో ప్రమాదం జరగడం చూసిన ఎంపీ వెంటనే ఘటనా స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్‌లు చేసి ఆదేశాలు జారీ చేశారు. 108 ద్వారా క్షతగాత్రులను తరలించే వరకు ఆయన ఘటనా స్థలంలోనే ఉండి పర్యవేక్షించారు.

ఉత్కంఠగా ఎడ్ల పోటీలు



బండను లాగుతున్న ఎడ్లు

పర్చూరు(చినగంజాం): మండలంలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో 36వ జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జూనియర్స్ విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి 8 ఎడ్ల జతలు పాల్గొన్నాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జరుగుతున్న పోటీలు ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ ఉంచి అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 12 మద్యం బాటిళ్లు శుక్రవారం రాత్రి ఎస్సై వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని శంఖవరప్పాడు గ్రామానికి చెందిన కొమ్మాలపాటి హనుమంతరావు అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్సై సిబ్బందితో దాడిచేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.